గ్రామీణ రోడ్ల నిర్మాణం ఎప్పుడో?

- అధ్వాన్నంగా మారిన లింకు, అంతర్గతరోడ్లు
- కొద్దిపాటి వర్షాలకే గోతులమయంగా మారుతున్న వైనం

ఉండి: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా గ్రామాలను కలిపే లింకు రోడ్లు, ఆర్అండ్బీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. జాతీయ, రాష్ట్ర రహదారులను అనుసంధానం చేస్తూ నిర్మితమైన రోడ్లు ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా, దూరాభారం లేకుండా చేసేందుకు నిర్మాణమైన రోడ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో ఇప్పుడవి ప్రజలు, ప్రయాణికుల పాలిట శాపంగా మారిపోయాయి. నిత్యం గ్రామీణ రోడ్లపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయంటే వాటి పరిస్థితి ఎంత అధ్వానంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజలు జాతీయ రహదారికి లేదా రాష్ట్ర రహదారులకు చేరుకోవాలంటే ఈ రోడ్లు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. అయితే రోడ్ల ఆలనాపాలనా చూసే అధికారులు ముఖం చాటేయడంతో అవి మరమ్మతులకు కూడా దూరమయ్యాయి. కొద్దికాలం క్రితం కొన్ని ప్రాంతాల్లో అరకొరగా చేసిన మరమ్మతులు కూడా పూర్తి నిర్లక్ష్యంతో చేయడంతో ఆ రోడ్లు కంటే గోతులేనయం అన్నట్టుగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేసిన తరువాత రోలర్ తిప్పకపోవడంతో రోడ్లపై గొప్పుల మాదిరి ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు.

ఈ రోడ్డును పట్టించుకోరూ?

ఉండి నుంచి పెదపుల్లేరు అక్కడి నుంచి చినపుల్లేరు, కాళ్ళ మండలం సీసలి గ్రామాల మీదుగా జువ్వలపాలెం రోడ్డును కలుస్తుంది. ఈ రోడ్డులో సుమారు 6 నుంచి 7 కి.మీ పొడవైన ఆర్అండ్బీ రోడ్డు గోతులమయంగా మారింది. ముఖ్యంగా


కొద్దిపాటి వర్షాలకే అధ్వానంగా మారిన ఉండి పెదపుల్లేరు రోడ్డు


పెదపుల్లేరు గ్రామంలో గోతులమయంగా మారిన రోడ్డు

రోడ్డు ముఖద్వారంలో అనగా సొసైటీ రైస్‌మిల్లు, ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలో ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పెదపుల్లేరు గ్రామం నుంచి దాని శివారు ప్రాంతం మేడవరం ప్రాంతం మీదుగా కాళ్ల మండలం కోమటిగుంట గ్రామం నుంచి జువ్వలపాలెం రోడ్డుకు చేరే రహదారి కూడా ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అలాగే ఉండి నుంచి వయా పెదపుల్లేరు, చినపుల్లేరు, సీసలి జువ్వలపాలెం రోడ్డు వరకు, మహదేవపట్నం వంతెన వద్ద నుంచి గ్రామంలోకి, ఉప్పులూరు నుంచి యండగండి వరకు, యండగండి శివారు రాయనివానిగూడెం నుంచి ఉణుదుర్రు వరకు, రాయనివాని గూడెం నుంచి పాందువ్వ వరకు, పాములపర్రు నుంచి పెదకాపవరం రోడ్డు, వెలివర్రు, పేరంటాలమ్మ గుడివద్ద నుంచి మహదేవపట్నం వరకు, చిలుకూరు నుంచి గరగపర్రు రోడ్లు, వాంద్రం రోడ్డులో కొంతభాగం, వాంద్రం నుంచి పెదపుల్లేరు లింకురోడ్డు, చెరుకువాడ, అర్తమూరు, కవిటంపాకల నుంచి మరింత అధ్వాన్నంగా ఉన్నాయి. కనీసం వర్షాకాలంలో అయినా రోడ్ల దుస్థితిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో అధ్వాన రోడ్లు

- ఆకివీడు మండలంలో చెరుకుమిల్లి,ఐభీమవరం రోడ్డు,బైపాస్ రోడ్డు
- కాళ్ళ మండలంలో కోనలపల్లి రోడ్డు,పల్లెపాలెం నుంచి ఎస్సీ బోసకాలనీ రోడ్డు
- పాలకోడేరు మండలంలో భీమవరం నుంచి పైపుల చెరువు మీదుగా వేండ్ర రోడ్డు
- మోగల్లు నుంచి వేండ్ర రోడ్డు, గరగపర్రు నుంచి మోగల్లు రోడ్డు, శృంగవృక్షం నుంచి యమునాపల్లి రోడ్డు.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



ఉండి-పెదపుల్లేరు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రహదారి మరమ్మతులు చేయకపోతే మరింతగా రోడ్డు పాడైపోతుంది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు మరమ్మతులు చేపడితే బాగుంటుంది.

– రాయి రావులమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, పెదపుల్లేరు

ముందే గమనించాలి కదా?



వర్షాకాలం రాబోతుంది కాబట్టి రోడ్ల పరిస్థితి ఎలా ఉందో? అని క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్లను పరిశీలించే అధికారి గానీ ప్రజాప్రతినిధి గాని లేరు. వర్షాలు రావడం మరింత పెద్ద పెద్ద గోతులు పడిపోవడం, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల వల్ల ప్రమాదాలు జరిగితే దానికి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలి.

– పీవీఆర్కే అంజనేయరాజు, వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు, వాంద్రం

క్లుప్తంగా

ఉమా మూలేశ్వర స్వామికి లక్షపత్రి పూజ


ప్రత్యేకాలంకరణలో ఉమా మూలేశ్వర స్వామి

వీరవాసరం: మండలంలోని రాయకుదురు శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం స్వామివారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. ముందుగా పంచామృత అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక హోమాలు చేపట్టారు. నుదురుపాటి కోదండ రామమూర్తి–సీతా మహాలక్ష్మి వేద పరిరక్షణ సమితి రాయకుదురు, హైదరాబాదు వారి సంయుక్త ఆధ్వర్యంలో నుదురుపాటి బాలగంగాధర శాస్త్రి వారి కుటుంబ సభ్యులతో పూజలు చేశారు. కార్యక్రమంలో నుదురుపాటి భానుమూర్తి, నుదురుపాటి రామం, అడ్డాల బాబీ, శంకరమంచి కృష్ణ పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి మందిరంలో అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం బంట్రోతు వారి వీధిలోని శ్రీవేణుగోపాల స్వామి మందిరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మందిర 53వ వార్షికోత్సవాలను నాలుగు రోజులపాటు విశేష పూజలతో నిర్వహిస్తున్నారు. అర్చకులు కోమ్ము శ్రీనివాస్ ప్రత్యేక పూజలు, చామంతి, గులాబీ పూలతో పూజ చేసి అలంకరణ చేశారు. అనంతరం సుమారు 2000 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాళ్ల: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాళ్ళ ఎస్సై ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని సీసలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు కాళ్ల పోలీసులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుడ్ టచ్–బ్యాడ్ టచ్ , స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

పాలకోడేరు: మండలంలో 0–6 సంవత్సరాల చిన్న పిల్లలకు రెండు విడతలుగా స్పెషల్ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వీవీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 19, 20 తేదీల్లో పాలకోడేరు–1 గ్రామ సచివాలయం, కుముదవల్లి గ్రామ సచివాలయం వద్ద, 21, 22 తేదీల్లో గరగపర్రు గ్రామ సచివాలయం, గొల్లలకోడేరు గ్రామ సచివాలయం వద్ద, 23, 28 తేదీల్లో గోరగనముడి గ్రామ సచివాలయం , వేండ్ర గ్రామ సచివాలయం వద్ద, 29, 30 తేదీల్లో శృంగవృక్షం –1గ్రామ సచివాలయం, కోరుకొల్లు గ్రామ సచివాలయం వద్ద క్యాంపులు నిర్వహిస్తాని స్పష్టం చేశారు.

ముంపునకు గురైన రైతులను ఆదుకోవాలి

ఉండి: మండలంలో ముంపునకు గురైన వరి చేలను గుర్తించి సదరు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కౌలు రైతు సంఘ నాయకుడు మాదాసి గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాందువ్వ, ఉప్పులూరు, కోలమూరు, యండగండి, ఎన్నార్పీ అగ్రహారం తదితర ప్రాంతాల్లో వరి పొలాలు ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగాయని పేర్కొన్నారు. వ్యవసాయాధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపునకు గురైన వరిచేలను గుర్తించాలని డిమాండ్ చేశారు.రైతులతో పాటు కౌలు రైతులకు తగిన గుర్తింపు ఇచ్చి వారికి నష్టపరిహారాన్ని అందించాలని కోరారు.

కార్మికుల హక్కులు కాపాడాలి

భీమవరం: ఐక్య పోరాటాల ద్వారా కార్మికుల హక్కులు కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వీ గోపాలన్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరం సీఐటీయూ పట్టణ 14వ మహాసభ యూటీఎఫ్ ఆఫీసులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ 20 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. సీఐటీయూ భీమవరం పట్టణ(కన్వీనర్) డేగల నాగేశ్వరరావు, జే.సూర్యచంద్ర రాజు(కో కన్వీనర్) తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్ మహాలక్ష్మి, పి.రాజేశ్వరి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి బంగారుహారం సమర్పణ


బంగారు హారం అందిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామికి బంగారుహారాన్ని మంగళవారం భక్తులు సమర్పించారు. భీమవరం వాస్తవ్యులు కళారి శ్రీనివాసరాజు, సూర్యకుమారి దంపతులు 71 గ్రాములతో సుమారు రూ.6,80,000 విలువైన రెండు పేటల లక్ష్మీదేవిలాకెట్ (బంగారు హారము) దేవస్థానం ఈఓ అరుణ్ కుమార్ సమక్షంలో అందించారు. దాతలను అభినందించి వారిని స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

భీమవరం: మెరుగైన కంటి చూపు కోసం, కంటి చూపు తగ్గకుండా ఉండడం కోసం ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, కంటి వైద్యుల వద్ద తగిన పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జేపీ రోడ్ ఆనంద ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి కలెక్టర్ చేతుల మీదుగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కంటి చూపు ఎంత ప్రధానమో, చూపు తగ్గిన వారు దాని నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా అంతే ముఖ్యమన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకోని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ నిర్వాహకులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్ల పంపిణీకి ముందుకు వచ్చి అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశి విశ్వనాథరాజు మాట్లాడుతూ జులై 17న సుమారు 800 మందికి ఏలూరు ఆశ్రం ఆస్పత్రి, భీమవరం వీవీఎస్ఎం ఐ హాస్పిటల్ సౌజన్యంతో భీమవరం ఆనంద ఫంక్షన్ హాలులో కంటి పరీక్షలను నిర్వహించామన్నారు. కంటి చూపులో లోపాలున్నవారికి శస్త్ర చికిత్సలు చేయించి, కళ్లజోళ్ళు అవసరమైన 360 మందికి కళ్లజోళ్లను అందించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ వి.రామరాజు, దాయన చంద్రాజి, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ రఘుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.


కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

22న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఉండి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బొక్కా సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం యాన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్), ఏపీఈపీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పరిష్కార వేదికలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తారని వివరించారు. విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భీమవరం: ఆసుపత్రిలో చికిత్స పొంది ర్యాపిడో మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతున్న మహిళను మరో మోటార్ సైకిల్ ఢీకొట్టిందని భీమవరం టూటౌన్ ఏఎస్సై ఎస్.వెంకటరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మల్టీప్లెక్స్ వెనుకగల యాదవుల వీధికి చెందిన వెలుగుల కనక మహాలక్ష్మి ఈనెల 18న భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలోని చికిత్స అనంతరం ర్యాపిడో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వేగంగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఈమె ప్రయాణిస్తున్న ర్యాపిడో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె గాయపడడంతో చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కాళ్ల: పేకాట స్థావరంపై దాడిచేసి పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ల ఎస్సై మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కలవపూడి శివారు మోడిలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామని పేర్కొన్నారు. ఈ దాడిలో పది మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.2,700/– నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి భీమవరం స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున రూ. 20 వేలు విధించినట్లు రూరల్ ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. ఈ నెల 8న కొవ్వాడ పుంత సెంటర్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పూజారి వెంకట్రావు, కొమ్మన వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని వివరించారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చడంతో ఈ మేరకు జరిమానా విధించారని పేర్కొన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి

భీమవరం: కలెక్టరేట్ భవనం నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులను, రాజకీయ పక్షాలను కలుపుకుని ప్రజామోదయోగ్యంతో కలెక్టరేట్ నిర్మాణం ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో నూతన కలెక్టరేట్ భవనాన్ని ఎక్కడ నిర్మిస్తారో తక్షణం జిల్లా అధికారులు జిల్లా ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో, ప్రింట్ మీడియా వేదికగా ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ముఖ్యమంత్రిని కలిసి పీ4 పద్ధతిలో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ శంకుస్థాపనకు రావాలని కోరినట్లు ప్రచారం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రి, రాజ్యసభ ఎంపీ, శాసన మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ లు, రాష్ట్ర పీఏసీ చైర్మన్, ఏడుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా వీరి అభిప్రాయం ఏంటో కూడా నేటికీ ప్రజలకు తెలికపోవడమే కాకుండా ముఖ్యమంత్రిని కలిసినవారిలో కూడా లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పీ–4పద్ధతిలో కలెక్టరేట్ భవన నిర్మాణం అంటే ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా నిర్మించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్

సమాచార హక్కు చట్టంపై అవగాహన


భీమవరం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కాళ్ల: కోపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా సహకార అధికారి ఎస్.మురళీ కృష్ణ అన్నారు. భీమవరంలో మంగళవారం సమాచార హక్కు చట్టం గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు తాము కోరిన సమాచారాన్ని సమాచార అధికారి 30 రోజులలోగా అందచేయాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు పారదర్శకంగా ప్రజలు తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి ఎ.శ్రీనివాస్, జి.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు, పి.రామదాసు, ఐ హుస్సేన్, ఐ.వెంకటేశ్వరరావు, ఎ.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కోపల్లెలో..

కాళ్ల: సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కోపల్లె సొసైటీ సీఈఓ జంపన సాయిగీత అన్నారు. కోపల్లె విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమాచారహక్కు చట్టంపై సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఈవో సాయిగీత మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా అడిగి పొందవచ్చన్నారు. అనంతరం గ్రామంలో రైతులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఈఓ మన్నే వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

శృంగవృక్షంలో..

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం విశాల సహకార పరపతి సంఘంలో సొసైటీ చైర్ పర్సన్ కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి) రైతులకు మంగళవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు మన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతిని వెలికితీయవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరవల్లి శ్రీనివాస కుమార్, కడలి రంగారావు, కార్యదర్శి మేడిది గణపతి పాల్గొన్నారు.

ముంపునకు గురైన వరిచేల పరిశీలన

భీమవరం అర్బన్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలలోని కొన్ని చోట్ల పంట చేలు ముంపునకు గురయ్యాని రైతులు వరద నీటిని తక్షణమే తొలగించాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని తాడేరులో మంగళవారం ముంపునకు గురైన వరి చేలను ఏఓ యర్రంశెట్టి ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వా సాగులో ఎంటీయూ 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 వంగడాలు 5 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయన్నారు. వర్షపు నీటితో మునిగిన వరిచేలల్లోని వరద నీటిని తొలగించి అవసరమైన చోట్ల వరినాట్లు వేయాలని సూచించారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 10–15 కిలోల పొటాష్ అదనంగా వేయాలని సూచించారు. మండలంలో ఇటీవల వర్షాలకు 200 ఎకరాలలో పంట చేలు ముంపుకు గురయ్యాయ్యన్నారు. అనాకోడేరు–15, తాడేరు –50, తుందుర్రు– 90, బేతపూడి –30, యనమదుర్రు –15 మొత్తం 200 ఎకరాలలో వరి చేలు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు.


తాడేరులో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్

13న జాతీయ లోక్ అదాలత్

భీమవరం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న భీమవరంలో ఉన్న అన్ని కోర్టుల ప్రాంగణంలో ×జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని సంస్థ చైర్మన్ 3వ అదనపు జిల్లా జడ్జి గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.ఈ జాతీయ లోక్ అదాలత్ లో అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, చెక్కు బాకీ కేసులు, భార్య భర్త తగాయిదా కేసులు, మనోవర్తి, గృహహింస కేసులు, చిట్‌ఫండ్, ఫైనాన్స్ కంపెనీ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ తదితర కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకుంటే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందని స్పష్టం చేశారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించి ఎక్కువ కేసుల రాజీ చేసేందుకు కృషి చేయాలని కోరారు.

వైభవంగా శివ సహస్రనామ పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సప్తసోమవారాల ప్రదక్షిణల్లో పాల్గొని ఏడు సోమవారాలు పూర్తిచేసుకున్న భక్తులు మంగళవారం శివ సహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. సుమారు 80 మంది భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు అనిల్, మద్దూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


భీమవరం: డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలేనని, కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే కెమెరా కనుగొనకపోతే చరిత్రకు చిహ్నాలు లేవని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం ఏరియా ఫోటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మంది సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామాయణం శివ, ఘంట చంటి, ఘంట గణేష్, కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ముక్కు సింహాద్రి, ఎస్.నాగు పాల్గొన్నారు. అలాగే డీఎన్ఆర్ కాలేజ్ రోడ్ ఎస్ఎల్ గ్రాండ్ కల్యాణ మండపంలో భీమవరం ప్రొఫెషనల్ ఫోటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డీ నటరాజ్ (గిరి) ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గిరి, వైస్ ప్రెసిడెంట్ రంగసూరి చినబాబు, జాయింట్ సెక్రెటరీ ఎస్కే బాజీ ట్రెజరర్ మల్లిపూడి శరణ మయ్యప్ప, బి.రాకేష్ బాబు ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకు నిలువుటద్దం ఫొటోగ్రఫీ

ఆకివీడు: చరిత్రకు నిలువుటద్దం ఫొటోగ్రఫీ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్ నందాను సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్సీపీ పట్టణ మహిళా విభాగం సభ్యురాలు తిప్పా దుర్గా భవానీ, కౌన్సిలర్ శ్యామలను సత్కరించారు.

దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం

ఆకివీడు: స్థానిక వనువులమ్మ అమ్మవారి దేవస్థానం నూతన పాలకవర్గం మంగళవారం ప్రమాణస్వీకారం చేసింది. దేవస్థానం ఈఓ ఏ. సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ చైర్మన్‌గా కొల్లి వెంకన్నబాబు, పాలక వర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్
90102 23729
90108 51166
Office mail : tpgadvt@gmail.com